క్లుప్తంగా

నేడు దుర్గమ్మ రథం రాక

మధురపూడి: విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి రథం శుక్రవారం ఉదయం 7 గంటలకు కాపవరం వస్తుందని, రథానికి స్వాగతం పలకడానికి స్థానిక రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తులందరూ రావాలని ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జీ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. అమ్మవారి రథం కోరుకొండ మెయిన్ రోడ్డు మీదుగా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకూ వెళుతుందన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు అందిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ బ్రహ్మలింగం చెరువు వద్ద ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు గురువారం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. బ్రహ్మలింగం చెరువు సమీపంలో కె.సత్యవతి, బొండమూరి ఆంజనేయులు కమ్మరి కొలిమిలు నిర్వహిస్తున్నారు. అక్కడ వ్యవసాయ సంబంధ వస్తువులు తయారు చేస్తారు. ఆ పాకలు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయాయి. ఈ నేపథ్యంలో బాధితులను విజయలక్ష్మి పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కేతినీడి అశోక్, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, బొరుసు బద్రి, వాకా నరసింహారావు, బొండాడ చందు, కటకం బాబ్జీ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరస్వామికి పూజలు


పెదరాయవరంలో రాజరాజేశ్వరస్వామివారు

రంగంపేట: పెదరాయవరం గ్రామంలో కొలువైన పార్వతీ సమేత సర్వమంగళ రాజరాజేశ్వర స్వామికి పోలి పాడ్యమి సందర్భంగా బుధవారం రాత్రి జటాజూట అలంకరణ, దీపాలంకరణ సేవలు శోభాయమానంగా జరిగాయి. గ్రామ పురోహితుడు మునుకుట్ల శివరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అవసరాల సాయిసుధీర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పుష్పాలంకరణకు చంద్రేడు ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు గరిమెళ్ల అరుణ ఆర్థిక సహాయం అందించారు. మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను తిలకించారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన


ఈవీఎంల పనితీరును వివరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటింగ్, కౌంటింగ్‌కు వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల వినియోగం, పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎం డిమానిస్ట్రేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వై.సరస్వతి మాట్లాడుతూ సెలవు రోజులు మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈవీఎంల వినియోగించడంపై అవగాహన కల్పిస్తారన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ టి.శశిధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

పెదపూడి: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని మండల శాఖ కమిటీ కన్వీనర్, కాకినాడ జిల్లా ఆఫీస్ బేరర్ మిరియాల రాజేశ్వరి డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో మూడో రోజుకు చేరింది. యూనియన్ ప్రతినిధులు ఎ.కనకదుర్గ, వి.భారతి, జి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది తమ డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పోసిబాబుకు వినతిపత్రం అందించారు.

రాజానగరంలో..

రాజానగరం: సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది రాజానగరంలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పాలకులు తమ సమస్యలను అర్థం చేసుకుని సత్వరమే తీర్చాలని కోరారు.

సీతానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగించారు.

నరసన్న గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

- నేటి ఉదయం 9.32 గంటలకు ప్రారంభం
- పూర్తయిన ఏర్పాట్లు

మధురపూడి: కోరుకొండలో కొలువుదీరిన లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 9.32 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీంతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న భక్తుల కోరిక నెరవేరనుంది. గిరి ప్రదక్షిణ చేసి స్వామి దర్శనంతో కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ మార్గం లేనప్పుడు కొండచుట్టూ తిరగడానికి భక్తులు ఇబ్బంది పడేవారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో భక్తులకు అందుబాటులోకి వచ్చింది. 1.50 కిలోమీటర్ల పొడవు, 4 మీటర్లు వెడల్పుతో గిరి ప్రదక్షిణ మార్గం నిర్మాణమైంది. ఇందులో భాగంగా కొండ చుట్టూ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

ఏళ్ల కల సాకారం

ఎన్నో సంవత్సరాలు భక్తుల కల నేడు నెరవేరతోంది. ధనుర్మాసం, స్వామివారి కల్యాణం తదితర సందర్భాల్లో భక్తులు గిరి ప్రదక్షిణకు ఆసక్తి చూపుతారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి దర్శనానికి వస్తుంటారు. వీరికి అనుకూలంగా కూడా మార్గాన్ని సిద్ధం చేశారు. కొండపై నుంచి మట్టి, రాళ్లు కిందికి జారకుండా, కింది నుంచి జంతువులు మార్గంలోకి రాకుండా ఉండేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. స్వామివారి దేవస్థానం ఎడమవైపున గల రథం సమీపంలో నుంచి ప్రదక్షిణ మార్గం ప్రారంభమవుతుంది. కొండ వెనుక భాగంలోని ఫిల్మ్ నగర్ మీదుగా దేవుని కోనేరు వైపునకు దిగుతుంది. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా దేవస్థానానికి చేరుకోవచ్చు.


కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం


అందంగా తీర్చిదిద్దిన గిరి ప్రదక్షిణ మార్గం


దారిలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ దీపాలు

ఆనందంగా ఉంది



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామిరి దేవస్థానం చుట్టూ గిరి ప్రదక్షిణ మార్గం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. భక్తులకు ఇచ్చిన మాట ప్రకారం దాని నిర్మాణం పూర్తి చేశాం. 630 మెట్లతో ఆకాశానికి ఎగబాకిన కొండ, కొండచుట్టూ కిలోమీరన్నర పొడవు, 4 మీటర్ల వెడల్పుతో ప్రదక్షిణ మార్గం ఏర్పాటు చేశాం. విద్యుత్ సదుపాయాన్ని కల్పించాం. ఏకాగ్రతతో ప్రదక్షిణ చేసుకునేందుకు అనువుగా తీర్చిదిద్దాం.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే

నేడు గడప గడపకూ..

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు తెలిపారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: నందరాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణా పరమైన మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ 11 కేవీ ఫీడర్లపై విద్యుత్ సరఫరా ఉండదని ఆ సంస్థ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. దీంతో నందరాడ, నరేంద్రపురం, వెలుగుబందలలో గృహాలు, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

ఇద్దరిపై కేసు

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన మెడికల్ షాపు వాసు, సోడదాసి రమేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి గురువారం తెలిపారు. బొబ్బిల్లంకలో బుధవారం వీరిద్దరూ కర్రలతో కొట్టుకున్నారని, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.


సీతానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది


సీతానగరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులు

వారు సమ్మెలో.. వీరు సేవలో..

సీతానగరం: అంగన్‌వాడీ వర్కర్లు తమ సమస్య పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి, నిరసన తెలుపుతున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్ పాగిరి కృష్ణారావు, ఎంపీడీవో కె.రమేష్, ఎస్సై కె.చిరంజీవి ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లను గురువారం తెరిచారు. కొన్ని గ్రామాల్లో కేంద్రాల తాళాలు పగలకొట్టారు. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి పిల్లలకు వంటలు చేసి భోజనం అందించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు రేషన్ సరకులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెతో లబ్ధిదారులు, చిన్నారులు ఇబ్బంది పడకూడదని ఈ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ మహిళా పోలీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ సంక్షేమ పాలనకు అందరి మద్దతు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రఘుదేవపురంలో గడప గడపకూ..


రఘుదేవపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలుపుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆయన రఘుదేవపురంలో గురువారం నాలుగోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి అవ్వ, తాతల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు.

పేదల అభ్యున్నతి

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టి, దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి ఆయనను సీఎం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, ఉప సర్పంచ్ పట్టపగలు విష్ణు ప్రసాద్, దాసరి బాబీ, గెద్దాడ త్రిమూర్తులు, పాలచర్ల అచ్యుత రామారావు, పంతుల శ్రీను, వెలమాటి కాశీ, చుండ్రు శ్రీను, నిడదవోలు శ్రీనివాస్, సుంకర సూర్యచంద్రం, పిండి రాధాకృష్ణ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అతివలకు అగ్రాసనం

రాజానగరం: రాష్ట్రంలో మహిళా సాధికారత, సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ ఏరియా కోఆర్డినేటర్ జనార్దన్ ఆధ్వర్యంలో విలేజ్ ఏరియా అసిస్టెంట్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లతో రాజమహేంద్రవరంలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా ప్రగతిని సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లి, చైతన్యం తీసుకురావాలని సూచించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

గోకవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం నిర్వాసితులు గురువారం గోకవరంలో నిరసన దీక్ష చేపట్టారు. దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన పలువురు నిర్వాసితులు గ్రామ సర్పంచ్ కుంజం రాజమణి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ దీక్షకు మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై త్వరలో రంపచోడవరం ఐటీడీఏ పీఓ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తామని తెలిపారు.

కార్మికుల రక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల్లో ఉపాధి కల్పించే యజమానులకు గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు రూపొందించిన వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. పని ప్రదేశాలలో కార్మికులకు కనీస సదుపాయాలు కల్పించాలని, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ హానికారక పరిస్థితులలో పనిచేస్తున్న వారికి తరచుగా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కర్మాగారాల చట్టం 1984 ప్రకారం సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తమ అధికారిక పరిధిలో ఉన్న ఏ కర్మాగారాన్ని అయిన ఎప్పుడైనా తనిఖీ చేసే అధికారం ఉందన్నారు. యాజమాన్యాలు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సదస్సులో నగర అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వలీ, రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ధవళేశ్వరం: క్షయ వ్యాధిగ్రస్తులకు పూర్తి చికిత్సతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ అన్నారు. గురువారం ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 200 మంది వ్యాధిగ్రస్తులకు ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఆరు నెలల పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్ వైజర్ కుమారి, రత్నకుమారి పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి


రామవరంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ

అనపర్తి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ అన్నారు. రామవరం పంచాయతీ ఒకటో వార్డులో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో గ్రామాలు ప్రగతి బాట పడుతున్నాయన్నారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, వార్డు సభ్యురాలు నల్లమిల్లి సంధ్య, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ మేడపాటి వాసు, నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, పడాల సత్తిరెడ్డి, నల్లమిల్లి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


పందలపాక అంగన్‌వాడీ కేంద్రం వద్ద సచివాలయ సిబ్బంది

బిక్కవోలు: మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఆయా కేంద్రాలను పంచాయతీ అధికారులు తెరిచారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు స్వాధీనం చేసుకున్నారు. ఎంపీడీఓ జేఏ ఝాన్సీ మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,553 కిలోల బియ్యం, 288 కిలోల కందిపప్పు, 780 కోడిగుడ్లు ఉన్నట్లు తెలిపారు.

పెదపూడి: నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాలపై అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించామని ఎంపీడీఓ వీవీ సాయిబాబు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బందితో కలసి ఆయన పెదపూడిలోని తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సందర్శించారు. తాళాలు పగులగొట్టి లోపల చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించే పోషకాహారం స్టాక్ ఎంత ఉందో, రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదోనని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టాక్ పరిశీలించారన్నారు. ఈ నివేదికలు ఉన్నత అధికారులకు తెలియజేశామన్నారు. ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు, అచ్చిరాజు, త్రినాథ్, వీఆర్వోలు ఉన్నారు.

ఊరంతా వేడుకగా..


బిక్కవోలులో వీరభద్రుని సంబరంలో ప్రజలు

బిక్కవోలు: స్థానిక శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సుబ్బారాయుడి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా వీరభద్రుని సంబరం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. షష్ఠి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బిక్కవోలుకు చెందిన జంగా గంగాధర్‌రెడ్డి, శ్రీవిద్య దంపతులు పీటలపై కూర్చుని సంబరానికి కర్తలుగా వ్యవహరించారు. తొలుత ఊరేగింపుగా వెళ్లి కాలువ వద్ద ప్రత్యేక పూజల అనంతరం సంబరం నిర్వహించారు. శ్రీలక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనువాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గువ్వల సత్తిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, చింతపల్లి వీరబాబు, వంగా రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్న పథకాలతోనే పేదరిక నిర్మూలన


పాలమూరులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతోందని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. పాలమూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వివిధ సంక్షేమ పథకాల అమలు చేయడం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేరువైందన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీటీసీ సభ్యుడు సత్తి కనకారెడ్డి, ఈఓపీఆర్డీ పద్మజ పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ప్రభుత్వం అండ


ముగ్గళ్లలో బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం/రాజానగరం: మిచాంగ్ తుపాను బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఆమె గురువారం ముగ్గళ్లలో 250 కుటుంబాలను, రాజానగరం మండలం జి యర్రంపాలెంలో తుపాను బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాను ప్రభావంతో పంట నష్టం వాటిల్లిందని, కొన్ని ప్రాంతాలలో పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్నాయని, వారందరినీ ప్రభుత్వం తరపున ఆదుకుంటున్నామని తెలిపారు. ముగ్గళ్లలో 250 మంది బాధితులకు ప్రభుత్వం తరపున ఒకొక్కరికి 25 కిలోల బియ్యం, కందిపప్పు, ఆయిల్, ఉల్లిపాయలు, కూరగాయలు, అలాగే రాజానగరం మండలం జి.యర్రంపాలెంలో ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమలో తహసీల్దార్ పాగిరి కృష్ణారావు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, పార్టీ కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్ సత్యం రాంపండు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, సాదే చంటిబాబు పాల్గొన్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం


వడిశలేరులో భజేనారాయణస్వామికి పూజలు

రంగంపేట: వడిశలేరులో కొలువైన భజేనారాయణ స్వామివారి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకూ జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా భజేనారాయణ స్వామివారిని గురువారం మత్స్య, శేషపాన్పు అవతారాల్లో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం స్వామివారిని కూర్మా, జగన్మోహినీ అవతారాల్లో అలంకరించనున్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముమ్మన రాంబాబు రెడ్డి, సభ్యులు వల్లూరి సూర్యభాస్కరరావు పాల్గొన్నారు.